ట్రాఫికర్

- వేములవలస కూడలిలో గజిబిజిగా ట్రాఫిక్
- డైలీ మార్కెట్ కారణంగా విపరీతమైన రద్దీ
- నిలిచిపోతున్న వాహనాలు
- ప్రయాణికుల అవస్థలు

తగరపువలస: ఆనందపురం మండలం వేములవలస కూడలి ప్రయాణికుల పాలిట ప్రాణసంకటంగా మారింది. గతంలో ఈ ప్రాంత జాతీయరహదారి మీదుగా ఇరువైపులా వాహనాలు సాఫీగా సాగిపోయేవి. జాతీయ రహదారుల విస్తరణలో భాగంగా వేములవలస కూడలిలో అదనంగా మరో రెండు ఫ్లై ఓవర్లు నిర్మించి, విశాఖ నుంచి వచ్చే వాహనాలను ఇక్కడ ఏర్పాటు చేసిన సర్కిల్ ద్వారా మళ్లిస్తున్నారు. అంతేకాకుండా, తగరపువలస మీదుగా పెందుర్తి, అనకాపల్లి వైపు వెళ్లే వాహనాలు కూడా ఈ సర్కిల్ నుంచే రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో ఇక్కడ నిత్యం బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణికుల సంఖ్య వేలల్లో ఉంటుంది. ఫ్లై ఓవర్ల కింద చాలావరకు ఖాళీ ప్రదేశం ఉన్నా ప్రయాణికులకు రక్షణగా జోన్ లేకుండా గ్రిల్స్‌తో మూసివేశారు. దీంతో తప్పనిసరిగా ప్రయాణికులు వాహనాల రాకపోకలు సాగించే రహదారి మీదే కాపు కాయవలసి ఉంటుంది. ఇక్కడ ఇంత ఇబ్బందికర పరిస్థితులు నెలకొని ఉన్నా ట్రాఫిక్ పోలీసుల సిబ్బంది కొరత కారణంగా ఒక్కరో, ఇద్దరో ఉంటున్నారు. వీరి ద్వారా ట్రాఫిక్ క్రమబద్ధీకరణ సాధ్యం కావడం లేదు.

మార్కెట్‌తోనే అసలు తంటా

వేములవలస కూడలిలో ఫ్లై ఓవర్‌ను ఆనుకుని నిర్వహిస్తున్న మహాత్మాగాంధీ డైలీ మార్కెట్ కారణంగా నిత్యం వందలాది మంది వినియోగదారులు, వ్యాపారులు వస్తుంటారు. ముఖ్యంగా పూల చిరు వ్యాపారులు రోడ్డుమీదే నిలబడి పువ్వులను విక్రయిస్తుంటారు. దీంతో మార్కెట్‌కు వచ్చేవారు, రాకపోకలు సాగించేవారు రద్దీగా ఉండే కూడలిలోనే తమ వాహనాలను నిలిపి, వెళ్లిపోతుంటారు. ఇది చాలదన్నట్లు పదుల సంఖ్యలో పశువులు ఈ నడిరోడ్డు మీదే తిష్ట వేస్తుంటాయి. ఈ కారణాలతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం ముంచుకు వస్తుందోనని ప్రయాణికులు నిత్యం సతమతమవుతుంటారు. బస్సుల కోసం వేచి ఉండేవారికి రక్షణజోన్ ఏర్పాటు చేసి వాహనాలేవీ నిలిపి ఉంచకుండా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఫ్లై ఓవర్ కింద, సర్కిల్‌లోనూ ఉన్న మిగిలిన స్థలాన్ని ప్రయాణికుల అవసరాలకు వినియోగించాలని కోరుతున్నారు.


సర్కిల్ పక్కనే నిలిపిన వాహనాలు


వేములవలస ఫ్లై ఓవర్ కింద బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు


కూడలి మధ్యలో తిష్ట వేసిన పశువులు


బస్సుల కోసం ఎదురుచూపులు

వాహనాలు దూసుకొస్తాయి



వేములవలస ఫ్లై ఓవర్ కింద ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రయాణికులు ఎక్కువగా ఉంటారు. ఆ సమయంలో దూసుకువచ్చే వాహనాలతో భయం వేస్తుంది. ముందు జాగ్రత్తగా స్టాపర్లు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి.

– సరగడ నాగిరెడ్డి, వినియోగదారుడు

ప్రయాణికులకు రక్షణ జోన్ ఉండాలి



బస్సులు, ఆటోలు ఇతర వాహనాలు వచ్చేటప్పుడు ప్రయాణికులు ఒక్కసారిగా వాహనాల వద్దకు పరుగెడుతుంటారు. అసలే ఇరుకైన మార్గం కావడంతో ప్రమాదాలు జరగవచ్చు. వాహనాలు నిలిపే సమయంలో వెనుక మరిన్ని వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్‌కు ఇబ్బందిగా ఉంటోంది. ఈ సర్కిల్‌ను తగ్గించి, రోడ్డు మార్గాన్ని పెంచాలి.

– జగన్నాథ ఎల్లాజీ, ప్రయాణికుడు

కస్తూర్బా విద్యార్థినికి నగదు బహుమతి



హాసినికి రూ.3వేలు చెక్కు, సర్టిఫికెట్ అందజేస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

పద్మనాభం: అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా ఈ నెల ఒకటో తేదీన నిర్వహించిన జిల్లా స్థాయి వ్యాసరచన పోటీల్లో పద్మనాభం కస్తూర్బా విద్యాలయం ఎనిమిదో తరగతి విద్యార్థిని మొకర హాసిని రెండో స్థానాన్ని కైవసం చేసుకుంది. డైరెక్టర్ ఆఫ్ హెల్త్, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. నగరంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో విజేత హాసినికి జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ రూ.3వేలు నగదు బహుమతి, సర్టిఫికెట్ అందజేశారు.

ఆత్మీయ వీడ్కోలు


సన్మాన గ్రహీతలతో నాయకులు, అధికారులు

పద్మనాభం: పద్మనాభం మండలం నుంచి బదిలీ అయిన పంచాయతీ కార్యదర్శులు, వెలుగు ఏపీపీ ప్రభాకర్‌కు గురువారం మండల పరిషత్ కార్యాలయంలో సన్మానం జరిగింది. వీరిని ఎంపీపీ కంటుబోతు రాంబాబు దుశ్శాలువాలతో సన్మానించి, పూల మొక్కలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, వైస్ ఎంపీపీ ఈర్ల రాజేశ్వరి, వెలుగు ఏపీఎం సాయి రమేష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన


శిల్పారామంలో కూచిపూడి నృత్యం ప్రదర్శిస్తున్న బాల కళాకారులు

పీఎం పాలెం: దసరా సంబరాలలో భాగంగా శిల్పారామం (జాతర)లో గురువారం సాయంత్రం 6 గంటలకు ప్రదర్శించిన కూడిపూడి నృత్య ప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకుంది. నగరానికి చెందిన మీనాక్షి కూచిపూడి డాన్స్ అకాడమీలో శిక్షణ పొందుతున్న చిన్నారులు దీక్షిత, మాన్యవి, మనోజ్ఞ, తన్మయి, విశిక, శివాని, మౌనిశ్రీ , విశాల, జ్యోత్స్న తదితరులు నృత్యాలతో అలరించారు. కాళీయమర్దనం, నవదుర్గాస్తోత్రం, బృంద నృత్యాలతో పాటు అన్నమయ్య కీర్తనలకు ప్రదర్శించిన నృత్యాంశాలు ప్రేక్షకుల మన్ననలు పొందాయి.

ఇస్కాన్‌లో దసరా ఉత్సవాలకు సన్నాహాలు

కొమ్మాది: బీచ్ రోడ్డు సాగర్‌నగర్ ఇస్కాన్ టెంపుల్‌లో శనివారం నిర్వహించనున్న దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తయినట్లు ఇస్కాన్ అధ్యక్షుడు సాంబదాస్ ప్రభూజీ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆ రోజు ఉదయం ప్రత్యేక పూజలు, విశేష అలంకరణ అనంతరం సాయంత్రం రావణ దహనం నిర్వహించనున్నట్లు తెలియజేశారు. 50 అడుగుల రావణ దిష్టిబొమ్మను దహనం చేసి, ఆ తరువాత ప్రత్యేకమైన ఫైర్ క్రాకర్ షో, సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు, రామ లీలపై ప్రవచనాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

8వ వార్డు సమస్యలపై జెడ్సీకి వినతి

మధురవాడ: జీవీఎంసీ 8వ వార్డులో సమస్యలు పరిష్కరించాలని జెడ్సీ సింహాచలానికి టీడీపీ వార్డు అధ్యక్షుడు చెట్టుపల్లి గోపి తదితరులు వినతి పత్రం ఇచ్చారు. వార్డులోని పలు కాలనీల్లో మంచి నీటి కుళాయిల ఏర్పాటు, సీసీ రోడ్లు, మురుగు నీటి కాల్వల నిర్మాణంతో పాటు వీధి దీపాల మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో వార్డు తెలుగు యువత అధ్యక్షుడు ఒమ్మి బాబూరావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా కోలాటం పోటీలు


పోటీల్లో పాల్గొన్న బాలికలు

భీమునిపట్నం: భీమిలి ఎంపీడీవో కార్యాలయం వద్ద గంటా నారాయణమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం మండల స్థాయి కోలాటం పోటీలు నిర్వహించారు. ఇందులో సీనియర్, జూనియర్ విభాగాల్లో 18 జట్లు పాల్గొన్నాయి. ఇన్‌చార్జి ఎంపీడీవో కె.రమేష్‌నాయుడు పర్యవేక్షణలో నిర్వహించిన పోటీలకు న్యాయ నిర్ణేతలుగా తహసీల్దారు పైల రామారావు, జోనల్ కమిషనర్ ప్రేమప్రసన్న వాణి, చిట్టివలస జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం మురళీమోహనరావు వ్యవహరించారు. సీనియర్ విభాగంలో చిప్పాడ జట్టు, జూనియర్ విభాగంలో యాతకుమ్మరిపాలెం జట్లు గెలుపొందాయి. ఈ జట్లు 12వ తేదీన భీమిలిలో జరిగే ఫైనల్ పోటీల్లో పాల్గొనున్నాయి. టీడీపీనాయకులు, అధికారులు పాల్గొన్నారు.

శ్మశానవాటికలో పని చేయని బోరు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటో వార్డు ఎల్లారమ్మ మెట్ట వద్ద శ్మశానవాటికలో బోరుబావి పనిచేయడం లేదని స్థానికులు తెలిపారు. తగరపువలస చుట్టుపక్కల గ్రామాల వారు ఆత్మీయుల అంతిమ సంస్కారాల కోసం ఇక్కడికి వచ్చినప్పుడు నీరు లేకపోవడంతో దూరప్రాంతాల నుంచి నీరు తెచ్చుకోవలసి వస్తోంది. ఇటీవల బాలాజీనగర్ సచివాలయంలో ఫిర్యాదు చేసినా స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే బోరుబావికి మరమ్మతులు చేసి, అందుబాటులో ఉంచాలని కోరారు.

విలేజ్ క్లినిక్ ముందు రాళ్ల కుప్పలతో అవస్థలు

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ పంచాయతీలోని విలేజ్ క్లినిక్ ముందు రాళ్ల కుప్పలు వైద్య ఆరోగ్య సిబ్బంది, పేషెంట్లకు ఇబ్బందికరంగా మారాయి. ముంపు నుంచి రక్షణ కోసం భవనం వద్ద ఎత్తు పెంచేందుకు గ్రావెల్, రాళ్లు తెచ్చినా.. చదును చేయకుండా కుప్పలుగా పోసి వదిలేశారు. సుమారు నెల రోజులుగా ఇలానే ఉండడంతో ఇక్కడికి వైద్యసేవలు పొందడానికి వచ్చేవారు రాళ్లపై నడవలేక తిరిగి వెనక్కు వెళ్లిపోతున్నారు. ఈ విషయాన్ని ఆరోగ్య సిబ్బంది పలుమార్లు పంచాయతీ పాలక వర్గం, మండల పరిషత్ కార్యాలయం అధికారుల దృష్టికి తీసుకువెళ్తున్నా స్పందించడం లేదని పంచాయతీ వాసులు వాపోతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామాలలోనే స్థానికంగా వైద్యసేవలు అందించాలన్న సదుద్దేశంతో విలేజ్ క్లినిక్‌లు నిర్మిస్తే, వాటికి అదనంగా సదుపాయాలు కల్పించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని అంటున్నారు.


చిప్పాడ విలేజ్ క్లినిక్ వద్ద అడ్డుగా రాళ్ల కుప్పలు

అనంతుని గిరిపైకి బస్సు నడపాలి

- ఎంపీపీ కంటుబోతు రాంబాబు
- పద్మనాభం మండల సమావేశంలో అధికారులకు వినతి

పద్మనాభం: సింహాచలం నుంచి పద్మనాభంలోని అనంత పద్మనాభ స్వామి గిరిపైకి బస్సు నడపాలని ఎంపీపీ కంటుబోతు రాంబాబు కోరారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీడీవో ఎం.విజయకుమార్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన పద్మనాభం మండల సర్వసభ్య సమావేశంలో శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. సమావేశంలో సింహాచలం ఆర్టీసీ డిపో సూపర్‌వైజర్ ఐ.వీరభద్రుడు మాట్లాడుతూ తమ శాఖ పరంగా సమస్యలు ఉంటే తెలియజేయాలన్నారు. దీనిపై ఎంపీపీ రాంబాబు మాట్లాడుతూ అనంత పద్మనాభ స్వామి గిరిపైకి వేస్తున్న బీటీ రోడ్డు త్వరలో పూర్తవుతున్నందున కొండపైకి బస్సు వేయాలన్నారు. దీనికి మండల పరిషత్ సభ్యులు మద్దతు పలికారు. దీనిపై ఆర్టీసీ ఆర్ఎంకు దరఖాస్తు చేయాలని వీరభద్రుడు తెలియజేశారు.

• మండల వ్యవసాయ శాఖ అధికారి ఎంపీఎస్ చలం మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకం కింద ప్రభుత్వం రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయనుందని తెలిపారు. దీనిపై జెడ్పీటీసీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు అభ్యంతరం వ్యక్తం చేస్తూ, ఇంతవరకు ప్రభుత్వం ఈ డబ్బులు వేయలేదని, ఈ ఏడాది గడిచిపోయిందని దీని గురించి ఎందుకు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

రోడ్డుకు మరమ్మతులు చేయాలి

ఐనాడ నుంచి రేవిడి జంక్షన్ వరకు రోడ్డు గోతులు పడిందని వీటికి మరమ్మతులు చేపట్టాలని బి.ఆర్.తాళ్లవలస సర్పంచ్ చందక శ్రీను సభ దృష్టికి తీసుకు వచ్చారు. బి.ఆర్.తాళ్లవలస ఎంపీటీసీ సభ్యుడు చందక పైడినాయుడు మాట్లాడుతూ బొత్సపేటలో అంగన్‌వాడీ కేంద్రం నిర్వహిస్తున్న ఇల్లు శిథిలావస్థలో ఉందని, కొత్తగా నిర్మిస్తున్న భవనాన్ని త్వరితగతిన పూర్తి చేసి కేంద్రాన్ని అందులోకి మార్చాలని కోరారు. శేరిఖండం, రెడ్డిపల్లి గ్రామాల్లో నీటి సమస్యలను శేరిఖండం సర్పంచ్ పల్లంటి చిన్నారావు సభ దృష్టికి తీసుకువచ్చారు. తహసీల్దార్ కె.ఆనంద కుమార్ మాట్లాడుతూ చెరువు గర్భాల ఆక్రమణదారులను తొలగించేందుకు సర్వే నిర్వహించి చెరువులకు సరిహద్దులు నిర్ణయిస్తామన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ ఈర్ల రాజేశ్వరి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.


సర్వసభ్య సమావేశంలో నివేదిక చదివి వినిపిస్తున్న ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో వరలక్ష్మి

వారపుసంత తరలింపుపై ప్రజాసంఘాల ఆగ్రహం


మధురవాడ జోనల్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహిస్తున్న ప్రజా సంఘాలు

మధురవాడ జోనల్ కార్యాలయం వద్ద ఆందోళన

మధురవాడ: మధురవాడ జోనల్ ఆఫీసు సమీపంలో వారపుసంతను వేరేచోటు తరలించే ప్రతిపాదనను తక్షణమే విరమించుకోవాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. పేదలు 40 ఏళ్లుగా ప్రతి శనివారం సంత నిర్వహిస్తూ జీవనోపాధి పొందుతున్నారని, వారి ఉపాధిని దెబ్బ తీయవద్దని కోరారు. వారపుసంత తరలింపును నిరసిస్తూ జోనల్ కార్యాలయం వద్ద సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ, పీవోడబ్ల్యూల ఆధ్వర్యంలో గురువారం ఆందోళన చేపట్టారు. ఐఎఫ్‌టీయూ నాయకుడు ఎం.వెంకటేశ్వర్లు, సీఐటీయూ నాయకుడు పి. రాజ్‌కుమార్, పీవోడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి ఎం.లక్ష్మి మాట్లాడుతూ రెండు వారాలుగా సంతలో వ్యాపారులను వ్యాపారం చేసుకోనివ్వకుండా బెదిరిస్తూ, సామగ్రి తొలగిస్తూ పోలీసులు, జీవీఎంసీ సిబ్బంది ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు.

ఈ విషయంపై కలెక్టర్, ఎమ్మెల్యేలకు వినతి పత్రాలు ఇచ్చినా దాడులు ఆపకపోవడంతో ధర్నా చేయవలసి వచ్చిందన్నారు. జోనల్ కమిషనర్ సింహాచలంకు వినతి పత్రం అందజేశారు. వ్యాపారులతో చర్చలు జరిపి, ప్రత్యామ్నాయ ప్రయత్నాలు ఉన్నతాధికారులకు తెలియజేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు డి.అప్పలరాజు, ఐఎఫ్‌టీయూ నాయకులు గీత, వెంకటలక్ష్మి, సంఘ నాయకులు టి. అప్పారావు, శంకరరావు, వెంకటరావు, ఎస్‌కే ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

జయహో దుర్గా భవానీ..

- దుర్గాదేవిగా అమ్మవారి దర్శనం
- వేడుకగా శరన్నవరాత్రి మహోత్సవాలు
- భక్తితో కుంకుమార్చనలు, హోమాలు


తాటితూరులో పైడితలమ్మకు రూపాయి నాణేల అలంకరణ


మజ్జివలస ఎస్సీ కాలనీ మండపం వద్ద దీపారాధన


దుర్గాదేవి అవతారంలో బబ్బేలమ్మ


దుర్గాలమ్మ ఆలయంలో దుర్గాదేవిగా..


బక్కన్నపాలెం పోలీస్ బెటాలియన్‌లో పూజలు అందుకుంటున్న దుర్గామాత


చిట్టివలస నవదుర్గా పీఠంలో చండీహోమం ఆచరిస్తున్న భవానీలు


మద్దిలో దుర్గాదేవి విగ్రహం వద్ద కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు


సంతపేట రెడ్డివీధిలో అమ్మవారి ఘటాలతో మహిళల ఊరేగింపు


కీతినపేట శ్రీవిద్యాపీఠంలో చండీహోమం


ఆనందపురం మండపంలో భవానీల పీఠం పూజ

తగరపువలస: శరన్నవరాత్రి మహోత్సవాల్లో ఎనిమిదో రోజు అమ్మవారు దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. ఆలయాల్లో, మండపాల్లో గురువారం దుర్గాష్టమి ప్రత్యేక పూజలు చేశారు. సామూహిక కుంకుమార్చనల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భవానీలు పీఠం పూజలు చేశారు. చండీహోమం నిర్వహించారు. తాటితూరులోని పైడితల్లమ్మ వారికి రూపాయి నాణేలతో చేసిన అలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సంతపేట రెడ్డివీధిలో అమ్మవారి ఘటాలతో మహిళలు ఊరేగింపు నిర్వహించారు.

దుర్గాదేవిగా బబ్బేలమ్మ

పీఎం పాలెం: కారుషెడ్ బబ్బేలమ్మ గురువారం త్రిశూలధారిణియై దుర్గామాతగా భక్తులకు దర్శనం ఇచ్చారు. అమ్మవారికి ప్రత్యేకంగా తయారు చేయించిన వివిధ రకాల వంటకాలను భక్తులు నైవేద్యంగా సమర్పించారు. ఉదయం, సాయంత్రం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో మహిళలకు కుంకుమ పూజలు చేశారు.

బక్కన్నపాలెం పోలీస్ బెటాలియన్‌లో..

విజయ దశమిని పురస్కరించుకుని బక్కన్నపాలెం ఏపీఎస్పీ పోలీస్ బెటాలియన్‌లో గురువారం దుర్గామాతను ప్రతిష్ఠించారు. 16వ బెటాలియన్ కమాండెంట్ కేవీ మురళీకృష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బెటాలియన్ అదనపు కమాండెంట్ సీహెచ్‌వీఎస్ పద్మనాభరాజు, స్థానిక అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

దుర్గా దేవిగా దుర్గాలమ్మ

మధురవాడ: శరన్నవరాత్రి ఉత్సవాల్లో 8వ రోజు చంద్రంపాలెం దుర్గాలమ్మ ఆలయంలో అమ్మవారు దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. టైలర్స్ కాలనీ, మానం ఆంజనేయులు నగర్‌లలోని ఆలయాల్లో దుర్గా మాతకు కుంకుమ పూజలు నిర్వహించారు. దుర్గాలమ్మ ఆలయంలో మధురవాడ శిల్పారామం ఏవో విశ్వనాథరెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దుర్గాదేవిగా పద్మావతి అమ్మవారు

భీమునిపట్నం: కృష్ణా కాలనీ కొండపై కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో పద్మావతి అమ్మవారు దుర్గాదేవిగా దర్శమిచ్చారు. మహిళలు సహస్ర కుంకుమార్చన నిర్వహించారు.

మద్దిలో ..

పద్మనాభం: మండలంలోని మద్దిలో నిలిపిన దుర్గాదేవి విగ్రహం వద్ద గురువారం రాత్రి మహిళలు కుంకుమ పూజలు చేశారు. అర్చకుడు సామవేదం సీతారామయ్య ఆధ్వర్యంలో ఈ పూజలు జరిగాయి.

అమ్మవారి మండపాల వద్ద నారాయణ సేవ

తగరపువలస: శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా గురువారం ఆనందపురం మండలం, భీమిలి అర్బన్, రూరల్ పరిధిలో పలుచోట్ల ఉత్సవ కమిటీ నిర్వాహకులు నారాయణసేవ చేశారు. అందులో భాగంగా భీమిలి మండలం శింగనబంధ పంచాయతీ కృష్ణంరాజుపేట, మజ్జివలస, టి.నగరపాలెం పంచాయతీ కొత్తూరులో భారీ అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. వీరికి టి.నగరపాలెం శ్రీరామ యువజన సంఘం ఆర్థిక సహకారం అందించింది. ఆనందపురం మండలం ఎస్సీ బీసీ కాలనీలో నిర్వాహకులు 3వేల మందికి అన్న ప్రసాదాలు పంపిణీ చేశారు. జీవీఎంసీ భీమిలి జోన్ పరిధి రెండోవార్డులో రాయల్ రెడ్డీస్ యూత్, చిట్టివలస రైతు బజారు, ఒకటోవార్డు కొండపేట దుర్గాంబిక ఆలయం వద్ద కూడా నిర్వాహకులు భారీ అన్నసమారాధన నిర్వహించారు.


ఎస్సీ బీసీ కాలనీలో అన్నసమారాధన


కొండపేట దుర్గాంబిక ఆలయం వద్ద..